# అన్నీ మంచి శకునములే..

- సీపీసీఆర్ఐ ఏర్పాటుకు మార్గం సుగమం
- మాధవరాయుడుపాలెం భూమిపై సీపీసీఆర్ఐ డైరెక్టర్ సంతృప్తి
- నెరవేరనున్న కొబ్బరి రైతుల కల
- మావి నాలుగు లక్ష్యాలు : సీపీసీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ చౌడప్ప



కడియం మండలం మాధవరాయుడుపాలెంలో సీపీసీఆర్ఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు కానున్న ప్రాంతమిదే..

**అమలాపురం /అంబాజీపేట :** కొబ్బరి రైతులకు శుభవార్త. సెంట్రల్ ప్లానిటేషన్ క్రాప్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీపీసీఆర్ఐ) ప్రాంతీయ కార్యాలయాన్ని జిల్లాలో ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అన్నీ అనుకూలిస్తే కడియం మండలం మాధవరాయుడుపాలెంలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. సీపీసీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ చౌడప్ప, శాస్త్రవేత్త నిహాల్‌లు భూమిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడంతో సీపీసీఆర్ఐ ఏర్పాటుకు తొలి అడుగు పడినట్టయ్యింది.

### దశాబ్దాల కాలం నాటి కల..

రాష్ట్రంలో 2.70 లక్షల ఎకరాల్లో కొబ్బరిసాగు జరుగుతుండగా, మన జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సాగుకు ఊతమిచ్చేలా సీపీసీఆర్ఐ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత రైతులు దశాబ్దకాలంగా కోరుతున్నారు. ముఖ్యంగా రాష్ట్ర విభజన తరువాత ఈ డిమాండ్ మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్)కు లేఖ రాసింది. ఇందుకు ఐసీఏఆర్ సానుకూలంగా స్పందించడంతో సీపీసీఆర్ఐ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. సీపీసీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ చౌడప్ప సైతం రాష్ట్రంలో సీపీసీఆర్ఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు చేయాలని తొలి నుంచి పట్టుదలగా ఉండడంతో ఈ కేంద్రం ఏర్పాటు వేగవంతమైంది.

### కోనసీమకు దక్కని అవకాశం

జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతుండగా, కోనసీమలోనే సుమారు 90 వేల ఎకరాల్లో ఈ సాగు జరుగుతోంది. దీంతో సీపీసీఆర్ఐని స్థానికంగా ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తూ వచ్చారు. అంబాజీపేటలోని డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉద్యాన పరిశోధనా స్థానంలో దీనిని ఏర్పాటు చేయాలని రైతులు పట్టుబట్టారు. ఇందుకు ఉద్యాన పరిశోధనా స్థానం పాలకమండలి, శాస్త్రవేత్తలు అభ్యంతరం తెలపడంతో ఇది కాస్తా కడియం మండలం మాధవరాయుడుపాలేనికి తరలిపోయింది.

### నాలుగు లక్ష్యాలు..

'సీపీసీఆర్ఐ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత కొబ్బరి సాగులో విప్లవాత్మక మార్పులు వస్తాయి. కొబ్బరి రైతులకు సాంకేతిక బదిలీతోపాటు పలువిధాలుగా సేవలందించాలని భావిస్తున్నాం. ఇక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా నాలుగు ప్రధాన లక్ష్యాలను నెరవేర్చాలని భావిస్తున్నాం' అని సీపీసీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ చౌడప్ప అన్నారు.



అంబాజీపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చౌడప్ప

అంబాజీపేట సహకార సంఘం అధ్యక్షుడు గణపతి వీరరాఘవుల స్వగృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

1. పొట్టిరకాల కొబ్బరికాయలను రైతులకు అందించాలన్నది మా తొలి ప్రాధాన్యం. దీని వల్ల కొబ్బరి దింపు కార్మికుల సమస్య తీరుతుంది. కోస్తా ప్రాంతంలో తుపాన్లు వచ్చే అవకాశమున్నందున పొట్టిరకాలను ప్రోత్సహిస్తే పంట దెబ్బతినే అవకాశం ఉండదు.
2. అంతర పంటల సాగుకు చేయూత. మరీ ముఖ్యంగా కోకోను అంతర పంటగా పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తాం. దీని వల్ల కొబ్బరికి ధర లేకున్నా రైతు ఏడాదికి ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఆదాయం పొందే అవకాశముంది.
3. విలువ ఆధారిత ఉత్పత్తులపై తయారీని పెద్ద ఎత్తున ప్రోత్సహించే అవకాశముంది. మన దేశంలో ఉత్పత్తయ్యే కొబ్బరిలో కేవలం ఆరు శాతం మాత్రమే విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. దీనిని కనీసం 25 శాతానికి పెంచాలన్నది సీపీసీఆర్ఐ ముందున్న లక్ష్యం.
4. కొబ్బరిసాగు విస్తారంగా సాగుతున్న కోనసీమలో కొబ్బరి పరిశ్రమల పార్క్ ఏర్పాటు చేస్తాం. దీని వల్ల కోనసీమలోనే కాకుండా కొబ్బరి ఎక్కువగా పండే పశ్చిమ గోదావరి, కృష్ణా, ఉత్తరాంధ్ర రైతులకు చాలా మేలు జరుగుతుంది.

నాడు
నేడు



సాక్షి Fri, 10 June 2016
epaper.sakshi.com/c/10894997